# నన్ను క్షమించరూ?

జి. ఉషావిశాల్

రైలు కూత వేసి బయలుదేరడానికి సిద్ధమవు తుండగా సత్యవతి ఆఖరుసారి అన్నది కళ్ళ నీళ్ళతో.


"ఏమండీ! నన్ను క్షమించరూ? ఇంకెప్పుడూ అలాంటి పన్లు చెయ్యను. అసలు వీధిలోకేరాను. ఈ ఒక్కసారికీ నన్ను మన్నించండి. ఇలాంటి పరిస్థితి మళ్ళీ రానివ్వను."

సుందర్రావు తల తిప్పలేదు. ఆమెవైపు చూడ లేదు. ఆమె మాటకి సమాధానం చెప్పలేదు. ఆ రోజులో కనీసం వందసార్లయినా, "నన్ను క్షమించరూ?" అని ఆమె అడిగివుంటుంది. సుందర్రావు ఒక్కసారి కూడా పెదవి కదపలేదు. రైలు నెమ్మదిగా కదిలి వేగం పుంజుకుంది. సత్యవతి నిరాశతో కిటికీమీద తల వాల్చి వెక్కి వెక్కి యేడవ సాగింది. తన కాపురం మూడునాళ్ళ ముచ్చటవు తుందని ఆమె కలలో కూడా అనుకోలేదు. కాని యిలా తన బ్రతుకు వీధినపడటానికి యెవరు కారణం? తనా? భర్తా? లేక యిరుగుపొరుగులా? ఎవర్నో యెందుకనుకోవడం? ముమ్మాటికీ తనే కారణం! తన తెలివితక్కువతనమే కారణం! వేదనతో అలమటించిపోతున్న ఆమె మనసు తన తప్పొప్పు లని బేరీజు వేసుకోసాగింది.

*

భర్త భోజనం చేసి అటు ఆఫీసుకి వెళ్ళిపోగానే, తనూ భోజనం చేసేసి, ముందు గదిలో చాప మీద పడుక్కుని యేదో పాత పత్రిక తిరగేస్తున్న సత్యవతి గుమ్మంలో అలికిడి అయినట్టుంటే దృష్టి మరల్చి అటు చూసింది. ఆరేళ్ళ చింపిరిజుట్టు పిల్ల జారిపోతున్న లాగూని ఒక చేత్తో పైకి లాక్కుంటూ —

"పిన్నీ! గాజులూ, రిబ్బన్లు వచ్చాయి. చూడ్డానికి అమ్మ రమ్మంది" అని చెప్పి సత్యవతి సమాధానం చెప్పే లోపలే తుర్రుమంది. సత్యవతి తమ వాటా తలుపు దగ్గరగా చేరవేసి నడవలోకి వచ్చింది. మగాళ్ళందరూ ఆఫీసులకి పోగానే అక్కడున్న నాలుగైదు కుటుంబాల ఆడంగులూ, స్కూళ్ళకి వెళ్ళని చిన్నపిల్లలూ ఆ నడవాలో చేరుతారు. మళ్ళీ మధ్యాహ్నం కాఫీల వేళదాకా కొత్తగా విడుదలైన సినిమాలూ, ఫాషన్లు, చీరలు, పుట్టిళ్ళు, కదుపులు, పురుళ్ళు, వీధిలో ఆఫీసుల్లో వుద్యోగం చేస్తున్న అమ్మాయిల నడతలూ, ఒక టేమిటి మాట్లాడదగిన ప్రతీ విషయం వాళ్ళ మధ్య నలిగిపోతూ వుంటుంది. మధ్య మధ్య యే స్టీలు సామానువాడో కనిపిస్తే పిలిచి బుట్ట దింపించి, యే అమ్మదగ్గరో వున్న నాలుగు పాత గుడ్డలు పడేసి, వాడి బుర్ర గిరెక్కిపోయేదాకా బేరాలు ఆడతారు. లేకపోతే వీధిలో పోతున్న గాజుల వాడినో, బట్టల మూటలవాడినో పిలిచి, అన్నీ చూసి, అన్నిటి ధరలూ కనుక్కుని, "నువ్వు కొనుక్కుంటావేమిటి వదినా?" అంటే, "నువ్వు కొనుక్కోరాదటే రాజీ!" అని పోటీలు వేసుకుని యెవరూ, యేదీ కొనకుండానే పంపే స్తారు. నిజానికి అందులో యెవరికీ ఆ చీరలుగాని, గాజులుగానీ కొనుక్కోగల తాహతు, అవసరమూ వుండవు. కాలక్షేపం కోసం, కంటికి నిండుగా కాస్సేపు చూడ్డానికి, ధరలు కనుక్కోడానికి వాళ్ళు వీధినపోయే బేరగాళ్ళను పిలుస్తూ వుంటారు. సత్య వతికి యింకా ఆ యింట్లోని అన్ని వాటాలవాళ్ళ తోనూ అంత పరిచయం యేర్పడలేదు. ఆమె అక్కడికి కాపరానికి వచ్చి పదిరోజులైందేమో! ఇన్నాళ్ళూ ఆమె భర్త సుందర్రావు శలవులో వుండి ఆ రోజే ఆఫీసుకి వెళ్ళేడు. అందుకని



అక్కడి ఆడంగులకి సత్యవతితో మాట్లాడ్డానికిగానీ, ఆమె పుట్టింటి వివరాలు తెలుసుకుందుకిగానీ వీలు పడలేదు. అన్ని రోజుల్లోనూ సత్యవతి యే బట్టలు ఆరవెయ్యడానికో, కొళాయిలో మంచినీళ్ళు పట్టుకుందుకో పెరట్లోకి వచ్చేదిగాని, అవి అందరికీ పనివేళలవడం వల్ల, ఆమెని కబుర్లలో పెట్టడం కుదర్లేదు. సత్యవతి నడవాలోకి వచ్చేసరికి అక్కడి ఆడవాళ్ళందరూ గాజులు, రిబ్బన్లు, తలకి పెట్టుకునే చవక రకం క్లిప్పులూ అమ్మేవాడి చుట్టూచేరి బేరం చేస్తున్నారు. సత్యవతి సంకోచిస్తూ నిలబడి పోవడం చూసిన మూడో వాటా శర్మగారి భార్య పక్కన నిల్చున్న యెడ పిల్లని చేత్తో నెడుతూ —

"పిన్నికి దారి యివ్వవే! రా! సత్యవతీ! కొత్త పెళ్ళికూతురివి గదా! గాజులు చూస్తావేమోనని కబురంపించాను." అని గాజులవాడితో.

"ఇదిగో! ఇందాకతీశావూ, 'శంకరాభరణం' గాజులూ, అవి చూపించూ" అంటూ ఆజ్ఞాపించింది. దాంతో అందరి దృష్టీ సత్యవతి మీదకి తిరిగింది. సత్యవతి పక్కవాటాలోని బామ్మగారు,

"సత్యవతీ! ఆ ఆకుపచ్చగాజులు తీసుకో, నీకు చాలా నప్పుతాయి." అంటూ వుచిత సలహా యిచ్చింది. మూడో యింటి రాజేశ్వరి మూతి విరుస్తూ,

"అబ్బే! అవేం గాజులండీ? మెరుపే లేవు. ఆ వెడల్పు గాజులున్నాయి చూడూ, అలాంటివైతే రెండు గాజులు వేసుకుంటే చేతికి నిండుగా వుంటాయి. అసలు యిప్పుడు అవే ఫాషను" అంది. గాజుల వాడితో బాటు సత్యవతీ ఆ సలహాలకి వుక్కిరి బిక్కిరి అయిపోసాగింది. గాజుల వాడికి అక్కడ నిజంగా కొనగలిగే వ్యక్తి సత్యవతి మాత్రమేనని అర్థమైందేమో, ఆమె ముందు పెట్టెలు తెరిచి రకరకాల గాజులు చూపించ సాగేడు. పుట్టి బుద్దెరిగి సత్యవతి అలాంటివి యెప్పుడూ చూడలేదు. ఆమె తండ్రి బెజవాడ దగ్గర పల్లెటూరిలో ఎలిమెంటరీ స్కూలు మాస్టరు. ఆయన ఆరుగురి సంతానంలోనూ పెద్దది సత్యవతి. చిన్నతనం నించీ ఆమె, తల్లి పురుళ్ళు, రోగాలు, యెడతెరిపిలేని చాకిరీ, తండ్రి ధుమధుమలు, ఆకలి, దారిద్ర్యం తప్ప మరొకటి యెరగదు. సత్యవతికి యిరవై సంవత్సరాలు నిండుతుండగా వున్న అర ఎకరం పొలం అమ్మి, వూళ్ళోవాళ్ళ సహాయంతో తండ్రి ఆమె కన్నెచెర విడిపించాడు. పెళ్ళి అయి భర్తకాపురానికి తీసుకొచ్చేవరకూ అంతా సవ్యంగా నడుస్తుందనే నమ్మకం సత్యవతికి కలగలేదు. పెళ్ళిలో ప్రతిదానికీ తడుముకోవాల్సే అయింది. దానికి తోడు మగపెళ్ళివారి పేచీ ఒకటి! తనకి పెళ్ళవుతోందన్న ఆనందం కంటే, యీ గొడవలతో పెళ్ళి మధ్యలో ఆగిపోదుగదా అన్న బెంగతోనే సత్యవతి అలమటించిపోయింది. ఎలాగో పెళ్ళి అయి, అచ్చట్లు, ముచ్చట్లు పూర్తయి భర్త వుద్యోగం చేస్తున్న హైద్రాబాద్‌కి వచ్చాకగాని సత్యవతి మనసు కుదుటపడలేదు. పెళ్ళికి ముందు తల్లి గాజుల మలారం వాడి దగ్గర గీసి గీసి బేరమాడి రెండు చేతులకీ రెండు డజన్ల ముతక గాజులు వేయించింది. ఇచ్చే కట్నం చాలా తక్కువ గనక మొగపెళ్ళివారు తాళి తప్ప మరో వస్తువు పెట్టలేదు. తల్లిదండ్రులు అతి కష్టంమీద ఒక చిన్న ముక్కుపుడక, అరకాసు దుద్దులు మాత్రం ఆమెకి బాల తొడుగుగా యివ్వగలిగేరు. అలాంటి పరిస్థితుల్లో మసలిన సత్యవతికి హఠాత్తుగా కళ్ళు చెదరగొట్టే ఆ రంగు రంగుల గాజులు, క్లిప్పులు, రిబ్బన్లు చూడగానే ఒక్క క్షణం మనసు అదుపు తప్పినట్టైంది. ఆమెకి ఆక్షణంలో తను యిప్పుడు స్వతంత్రురాలననీ, యేదైనా కావాలంటే కొనుక్కోగల స్వేచ్ఛ తనకి వుందని జ్ఞాపకం వచ్చి వుత్సా



హంగా తనకి నచ్చిన గాజులు యెంచుకో సాగింది. గాజుల బేరం అయాక సత్యవతి రిబ్బన్లు చూస్తూ వుంటే చివరి వాటా అన్నపూర్ణ—

“ఇప్పుడు జడలకి యెవరూ రిబ్బన్లు పెట్టుకోవడం లేదు. ఆ క్లిప్పులు కొనుక్కో! ఓ నాలుగైదు కొనుక్కున్నావంటే చీరలకి మాచింగ్‌గా తలకి పెట్టుకోవచ్చు.” అంది. అందరూ ఆవిడ్ని బలపరిచారు. క్లిప్పుల ధర చూసి నాలుగైదు కొనుక్కోడానికి ధైర్యం చెయ్యలేక ఓ రెండు క్లిప్పులు కొనుక్కుని, భర్త ఆఫీసుకి వెళుతూ, “వాకిట్లోకి కూరా, నారా వస్తే కొనడానికి వుంచు.” అంటూ యిచ్చిన పదిరూపాయలూ తీసుకొచ్చి గాజులవాడి చేతిలోపోసి వాడిచ్చిన చిల్లర డబ్బులు తీసుకుంది. ఆ రోజు ఆ మండువాయింట్లోని ఆడంగులకి సత్యవతి ధర్మమా అని టైము యిట్టే గడిచిపోయింది.

*

సత్యవతికి ఆ రోజు ప్రపంచాన్ని జయించినంత ఆనందంగా వుంది. తను స్వతంత్రించి తన జీవితంలో తానుగా యెంచుకుని కొనుక్కోగలిగిన ఆ గాజుల్ని, క్లిప్పుల్ని ఒకటికి పదిసార్లు తడిమి చూసుకుంది. ఆ సాయంత్రం గబగబ పనంతా పూర్తిచేసుకుని, స్నానం చేసి, కార్యంనాడు పెట్టిన ఎర్రంచు తెల్ల మిల్లుచీర కట్టుకుంది. పొడవాటి తన నొక్కులజుట్టుని, శర్మగారిభార్య సహాయంతో క్లిప్పులో బిగించి, చేతులకి పెళ్ళినాడు తల్లి వేయించిన ముతక గాజులు తీసేసి తను కొత్తగా కొన్న గాజుల్ని చేతుల్నిండా వేసుకుని ముస్తాబయి భర్త రాక కోసం యెదురు చూస్తూ కూర్చుంది. సాధారణంగా సుందర్రావుకి చీకటి పడేక యింటికి రావడం అలవాటు. కాని కొత్త పెళ్ళికూతురు సత్యవతి తనకోసం యెదురు చూస్తూ వుంటుందనే ఆలోచన అతన్ని ఆ రోజు త్వరగానే యిల్లు చేరుకునేటట్టు చేసింది. భర్తకి కాఫీ అందించి, తనను తన అలంకరణ మెచ్చుకోవాలని సత్యవతి ఒకటి రెండుసార్లు చేతి గాజులు, జుట్టు సవరించుకుంటూ అతని యెదురుగా నిల్చుంది. సుందర్రావు అది గమనించి,

“ఏమిటే విశేషం? అమ్మగారి అలంకారం జోరుగావుంది!” అన్నాడు చిరునవ్వుతో. సత్యవతి ఆనందంగా రెండుచేతుల్ని ముందుకు చాచి.

“బాగున్నాయా? ఇవాళ వాకిట్లోకి వస్తే కొన్నాను. రెండు క్లిప్పులు కూడా కొన్నాను.



క్రిస్టల్ ఏంజిల్ మేయర్స్

సికింద్రాబాదు రైల్వే డిగ్రీ కళాశాలలో బి. కామ్. ద్వితీయ సంవత్సరం చదువుతున్న కేడెట్ వారెంట్ ఆఫీసరు కుమారి క్రిస్టల్ ఏంజిల్ మేయర్స్, అక్టోబరులో కెనడాలో జరిగిన ప్రపంచ యువజన వినిమయ కార్యక్రమంలో (world youth exchange programme) పాల్గొనడానికి వెళ్ళారు.

భారతదేశం నుండి ఎన్నుకోడిన ఆరుగురు ఎన్. సి. సి. బాలికల్లో ఈమె ఆంధ్రప్రదేశ్ ప్రతినిధిగా వెళ్ళారు. ఇంతకు పూర్వం ఈమె తుపాకి పేల్చడంలోనూ, డ్రిల్లులోను బహుమతులు పొందడమే కాక, ఉత్తమ కేడెట్‌గా కూడా ఎన్నుకోబడ్డారు.

—హైద్రాబాదు విలేకరి

అబ్బ! ఎన్నిరకాల క్లిప్పులు వున్నాయండీ? ఇంకా రెండు తీసుకుందామంటే డబ్బులు చాల్లేదు.” అంది. ఆ మాటలకి సుందర్రావు ఆశ్చర్యంగా—

“ఎంతపెట్టి కొన్నావ్? మీవాళ్ళు నీకేమైనా డబ్బులు యిచ్చివుంటే దాచుకోవాలి గాని యిలా గాజులకీ, పూసలకీ, తగలేస్తారా? నీచేతికి ఇంతకు ముందున్న గాజులు బాగానే వున్నాయిగా? మళ్ళీ యిప్పుడు వీటిని కొనాల్సిన అవసరంయేం వచ్చిందీ?” అన్నాడు. భర్త తనని మెచ్చుకుంటాడనీ, మరో రెండు క్లిప్పులూ, గాజులూ మిగతా చీరలకి నప్పేటట్టు కొనుక్కోమంటాడనీ యెదురుచూసిన భర్త మాటలకి బిత్తరపోయింది. అతనుయింటి ఖర్చుకి యిచ్చిన డబ్బుతోనే అవన్నీ కొన్నానని చెప్పేధైర్యం లేక మౌనంగా వుండిపోయింది. సుందర్రావు భార్య చిన్నబుచ్చుకోవడం గమనించి, ఆ విషయం అక్కడికి ఆపేసి స్నానానికి వెళ్ళిపోయాడు. సత్యవతి అతను ఆ విషయాన్ని రెట్టించకపోవడంతో తేలిగ్గా నిట్టూర్చి కాఫీగ్లాసులు తొల్చుకోవడంలో మునిగిపోయింది. సుందర్రావు స్నానం చేసి వస్తూనే కూరల బుట్టలో మర్నాటికి కూరలు లేకపోవడం గమనించి,

“సత్యా! రేపటికి కూరలు లేవనుకుంటాను. అలా బజారుకి వెళ్ళి కొనుక్కొద్దాం పద!” అన్నాడు. బజారుకి వెళదాం అనగానే కూరల బుట్ట, తాళంకప్ప పట్టుకుని బయలుదేర బోతున్న సత్యవతిని, పర్సుతెరిచి చూసుకుంటూ

“పొద్దున్న నేనిచ్చిన పదిరూపాయలూ పట్రా! లేకపోతే అనవసరంగా యాభైరూపాలనోటు మార్చాల్సి వస్తుంది.” అని భర్త అనేసరికి నీరుగారిపోయింది. భర్తకి యేమని సమాధానం చెప్పాలో తోచలేదు, భార్య వున్నచోటు నించి కదలకుండా గుడ్లప్పచెప్పి చూస్తూ నిల్చోవడం చూసిన సుందర్రావు.

“నిన్నే! వెళ్ళి డబ్బులు పట్రా! మరీ చీకటి పడిపోతే పుచ్చువీ, చచ్చువీ అంటగడతారు.” అన్నాడు మళ్ళీ. ఇంక సత్యవతికి సమాధానం చెప్పక తప్పలేదు.

“ఆడబ్బు ఖర్చయిపోయిందండీ. ఈ గాజులూ అవీ ఆ డబ్బుతోనే కొన్నాను.” అంది భయపడుతూ. భార్య సమాధానానికి సుందర్రావు తెల్లబోయాడు. ఒక్క పూటలో గాజులకీ క్లిప్పులకీ పదిరూపాయలు ఖర్చుపెట్టిన భార్యమీద అతనికి విపరీతమైన కోపం వచ్చింది. కాని తనకీ, సత్యవతికీ వున్న ఆ అనుబంధం నెల రోజులనాటిది మాత్రమే నని జ్ఞాపకం వచ్చి కొంచెం తమాయించుకున్నాడు.

“ఒక్క పూటలో పదిరూపాయలు ఖర్చుపెట్టావా? నేనేమైనా ఆఫీసర్ని అనుకున్నావా? లేకపోతే నువ్వు జమీందారు కూతుర్ని అనుకున్నావా? అయినా యిప్పుడు ఆ గాజులూ, పూసలూ కొనాల్సిన అవసరమేమిటి? అవి లేకపోతే మన రోజు గడవదా?” అంటూ చీవాట్లు పెట్టాడు. భర్త కేకలకి సత్యవతి బిక్కచచ్చిపోయింది. పెళ్ళయిన ఈ నెల రోజుల్లోనూ ఆమె అతను కోపంగా వుండటం చూడలేదు. సుందర్రావు చిరచిరలాడుతూనే సత్యవతి చేతిలోని బుట్ట లాక్కుని వీధిలోకి వెళ్ళిపోయాడు. సత్యవతి

చిన్నబోయిన మొహంతో అలాగే నిలబడి పోయింది. ఆ రాత్రి సుందర్రావు సత్యవతితో అసలు మాట్లాడలేదు. ముభావంగా భోజనం చేసి పోయి పడుకున్నాడు. అతను స్వతహాగా లోభి కాదు గాని కొంచెం పొదుపరి. ఒక గవర్నమెంటాఫీసులో గుమస్తాగా పనిచేస్తున్న అతను, తనకి వచ్చే జీతంతో, ఆ పట్నంలో భార్యా, తను బ్రతకడమే గాకుండా, నెల నెల పల్లెటూర్లో కాస్తంత వ్యవసాయం మీది ఆదాయంతో కుటుంబాన్ని యీడ్చుకు వస్తున్న తండ్రికి రెండు వందల రూపాయలు పంపాలి. అతనికి యింకా పెళ్ళి కావలసిన చెల్లెళ్ళిద్దరూ, చదువు పూర్తికాని తమ్ముడొకడూ వున్నారు. నిజానికి ఈ కారణాల వల్లే పెళ్ళిళ్ళమార్కెట్లో అతనికి మంచి ధర పలకలేదు. ఉన్నంతలో పొదుపుగా గడుపుకుని తన సంసారానికి కావలసిన వస్తువులు ఒకొక్కటీ అమర్చుకోవాలని అతని తాపత్రయం. నలుగురున్న కుటుంబంలో నించి వచ్చినదీ, పేద యింటి పిల్లా అయిన సత్యవతి తనతో సహకరిస్తుందనుకున్నాడు. ఆదిలోనే హంసపాదన్నట్టుగా పొద్దున్న యిచ్చిన పది రూపాయలూ సాయంత్రానికి ఖర్చు పెట్టేసింది. అదీ ఆమె సంసారానికి పనికి వచ్చే వస్తువేదైనా కొని వుంటే అతనికి అంత కోపం రాక పోను. అతని దృష్టిలో ఆ గాజులూ, క్లిప్పులూ ఎందుకూ పనికిరాని వస్తువులు. వాటికి అంత డబ్బు ఖర్చు చెయ్యడం శుద్ధ తెలివి తక్కువతనం! సుందర్రావుకి ఏనాడూ తన భావాల్ని, ఆలోచనలని మరొకరితో చెప్పుకోవడం గాని, పంచుకోవడం గానీ అలవాటు లేదు. అందుకే అతను ఆ రాత్రి ముభావంగా వుండి పోయాడే తప్ప, భార్యతో తన మనసువిప్పి ఏ విషయం చెప్పలేదు. సత్యవతికి భర్తని ఎలా పలకరించాలో అతని కోపం యెలాగ పోగొట్టాలో అర్థం కాలేదు. మాట్లాడితే కోప్పడు తాడేమోననుకుంటూ తనూ మౌనంగా వుండి పోయింది.

❋

రెండు రోజులు గడిచేసరికి సుందర్రావు తన మౌనం విడిచి భార్యతో మామూలుగా గడప సాగేడు. సత్యవతికి ఆ రెండు రోజులూ భారంగా గడిచినట్టనిపించినా భర్త మళ్ళీ మామూలుగా మాట్లాడ్డంతో మనసు కుదుటపడింది. మూడోనాడు పెరట్లో నూతి దగ్గర బట్టలు వుతుక్కుంటున్న సత్యవతిని అన్నపూర్ణ పలకరించింది. ఆ యింట్లో సత్యవతీ వాళ్ళ వాటా కాక మరో నాలుగు వాటాలున్నాయి. అందరి వాటాలూ యించుమించు ఒక్కలాంటివే! ఒక గదీ, వంటిల్లూ! అందరికీ కామన్‌గా రెండు బాత్‌రూమ్‌లు, పాకీదొడ్లు, మంచి నీళ్ళ కొళాయి, కాస్తంత పెరడూ, వీధి వైపు చిన్న నడవా, నుయ్యి వున్నాయి. ఇంటివాళ్ళు పరాయి వూళ్లో ఎక్కడో వుంటున్నారు. మూడోవాటా శర్మ గారే నెల నెలా అందరి దగ్గరా అద్దె వసూలు చేసి ఇంటివాళ్ళకి పంపిస్తూ వుంటారు. సుందర్రావు నాలుగైదు సంవత్సరాల నించీ ఆ యింట్లో వుంటూ వుండటం చేత పెళ్ళవగానే సత్యవతిని కాపరానికి తీసుకు రావడానికి ఏమీ ఇబ్బంది లేకపోయింది. వీధి వైపు వాటాలో సుందర్రావు వుంటున్నాడు. పెరటి వైపు చివరివాటాలో అన్నపూర్ణావాళ్ళూ వుంటున్నారు. ఆ రోజు అన్నపూర్ణ నీళ్ళు తోడుకుంటున్న సత్యవతి దగ్గరగా వచ్చి,

"సత్యవతీ! పనయిపోయిందా?" అని అడిగి సత్యవతి తల వూపగానే పిల్లలు వింటారేమో నన్నట్టుగా రహస్యంగా ముందుకి వంగి,

"మార్నింగ్ షోకి వెళదాం వస్తావా?" అనడిగింది. సత్యవతి సమాధానం చెప్పేలోపలే మూడోవాటా రాజేశ్వరి యేదో పని వున్నట్టు గబగబ అటు వచ్చి,

"వదినా! టైమయిపోతోంది. ఇంకా ముచ్చట్లాడుతూ కూర్చున్నావా?" అంటూ హెచ్చరించింది. అన్నపూర్ణ హడావిడి పడిపోతూ,

"నేను రెడీ! పిల్లలు స్కూళ్ళకి పోతే తాళం వేసుకు వచ్చేయడమే! ఏమాత్రం పసికట్టినా కుర్ర వెధవలు వెంటపడతారు. అందుకే యింకా బట్టలు మార్చుకోలేదు. సత్యవతి కూడా వస్తుందేమోనని అడుగుతున్నాను." అంది. ఆవిడమాటకి రాజేశ్వరి,

"సత్యవతి రావడానికేం? మనలాంటి బాదర బందీలు తనకేం వున్నాయి? తన పని అయిపోయే వుంటుంది. మనలాగ రహస్యంగా యేడవాల్సిన అవసరం తనకేం లేదు. కొత్త పెళ్ళాం సినిమాకి వెళ్ళానూ అంటే సుందర్రావు కాదంటాడేమిటి? ఏమోయ్ సత్యవతీ నిజమేనా?" అంది సగం వేళాకోళం, సగం ఈర్ష్య మేళకించి. ఆ మాటలకి సత్యవతి పచ్చని చెంపలు కెంపురంగుని పులుముకున్నా భర్త కోపం గుర్తుకి రాగానే గుండె లయ తప్పింది. అతనితో చెప్పకుండా వీళ్ళతో సినిమాకి వెళ్లితే భర్త యేమంటాడో? సుందర్రావు దృష్టిలో సినిమాలు చూడ్డం డబ్బు దండగ పని. ఆ సంగతి అతను పెళ్ళయిన మూడోనాడే సత్యవతికి స్పష్టం చేశాడు. అతనికి తెలిసేటట్టు సినిమాకి వెళ్లితే గొడవ తప్పదు. పోనీ వెళ్ళడం మానేస్తే? అమ్మో! మళ్ళీ వీళ్ళందరికీ కుదిరేదెప్పుడో? అదీగాకుండా యెప్పుడో పెళ్లి కాకముందు తమ వూళ్లో టూరింగ్ టాకీసులో చూసిన సినిమా! మళ్ళీ యీ మధ్యలో చూడ్డం పడనేలేదు. సత్యవతి ఆలోచనలో పడింది. భర్త ఆఫీసుకి పోతున్నానంటూ కేక వెయ్యడంతో రాజేశ్వరీ, వంటింట్లో అన్నాలు తింటున్న పిల్లలు దెబ్బలాటకు దిగడంతో అన్నపూర్ణా సత్యవతి సమాధానం కోసం యెదురు చూడకుండా కంగారుగా తమ వాటాలవైపు వెళ్లి పోయారు. ఆలోచిస్తూనే సత్యవతి త్వరగా పని పూర్తి చేసుకుంది. తను సినిమా చూసినట్టు సుందర్రావుకి యెలా తెలుస్తుందీ? అందరూ పిల్లలకో, భర్తలకో భయపడుతూ రహస్యంగా వెళ్ళేవాళ్ళే గనక సినిమా విషయం బహిరంగంగా యెవరూ చర్చించరు. అదీ గాకుండా సుందర్రావు అవసరానికి మించి యెవరితోనూ మాట్లాడడు కాబట్టి మొగవాళ్ళ మాటల్లో కూడా విషయం బయటపడే అవకాశం లేదు. తను ఛస్తే అతనితో చెప్పదు. ఇంక తనకి భయమేమిటి? సత్యవతి యింకా సందిగ్ధంలో వుండగానే రాజేశ్వరీ, అన్నపూర్ణ తయారయి వచ్చేశారు. వాళ్ళని చూడగానే సత్యవతి మరేం ఆలోచించలేదు. బట్టలు మార్చుకుని రెండ్రోజులక్రితం భర్త యిచ్చిన డబ్బులో మిగిలిన డబ్బుని జేబురుమాల్లో కట్టుకుని, భయమూ, వుత్సాహమూ కలగాపులగంగా కలవర పరిచేస్తువుండగా సినిమాకి బయలుదేరింది.

❋

నెల రోజులు తిరిగేసరికి సత్యవతికి ఆ యింట్లోని అన్నివాటాల వాళ్ళతోనూ బాగా పరిచయం యేర్పడిపోయింది. అందర్నీ వరసలు పెట్టి "వదినా", "అక్కయ్యా" "పిన్నిగారూ" అంటూ పిలవడం, తను చేసిన వంటలూ అవీ తనకి యిష్టమైన వాళ్ళకి రుచులు చూపించడం, భర్త ఆఫీసుకి వెళ్ళిపోగానే తమ వాటాకి తాళం పెట్టి అందరితోపాటు నడవలో చేరి కబుర్లలో పాలు పంచుకోవటం, భర్తకి తెలియకుండా మోర్నింగ్‌షోలకి చెక్కెయ్యడం, పావలా పెట్టి కొన్న కూర అర్ధరూపాయి అయిందని భర్తకి చెప్పి తన సినిమాలకి, షోకులకి, మాచింగ్ గాజులకీ, పూసలకీ డబ్బులు మిగుల్చుకోవడం బాగా అలవాటైంది. ఆ సభలో చేరిన మొదటిరోజే

సత్యవతి ఆర్థికంగా అక్కడ వున్న అందరికంటే తనే కాస్త పై మెట్టులో వున్నట్టు గ్రహించింది. అందరూ యించుమించు ఒకే తరగతికి చెందిన వాళ్ళయినా, వాళ్ళందరికీ వున్నన్ని బాదర బందీలు కొత్తగా పెళ్ళయిన సత్యవతికి లేవు. మాటల సందర్భంలో ఎవరైనా "నీకేం సత్యవతీ! పిల్లా? పీచా? పైగా కొత్త పెళ్ళికూతురివీ. నీమాట మీ ఆయన కాదంటాడేమిటి" అని అంటే చాలు పొంగి పోయేది, వాళ్ళందరికంటే నిజంగా తాను గొప్పదాన్ననుకొనేది. తన పుట్టింటి గురించి వున్నవీ, లేనివీ కల్పించి గొప్పలు చెప్పుకుని తృప్తిపడేది! తమకి బోలెడంత ఆస్థి వుందనేది! తల్లికి మొయ్యలేనంత బంగారం వుందనేది! తన నగలన్నీ అత్తవారింట్లో వున్నాయనేది. ఆమె కబుర్లతో అందరికీ మంచి కాలక్షేపం అవడం చేత అందరూ ఆమె కబుర్లు నమ్మినట్టే వుండేవారు.

ఒక రోజు అలాంటి కబుర్లలో ముమ్మరంగా మునిగి వున్న సమయంలో బట్టల మూటలవాడు వచ్చాడు. వాడిని యెవరూ పిలవలేదు గానీ, నాలుగు నెలల క్రితం శర్మగారి భార్య వాయిదాల పద్ధతిలో వాడిదగ్గరో చీర తీసుకుంది. ఆ బాకీ వసూలు చేసుకు పోవడానికి వాడు వచ్చాడు. అందరూ అన్ని కబుర్లు మరిచిపోయి వాడి చుట్టూ చేరారు. రకరకాల చీరలు తీయించి ధరలు కనుక్కుంటూ, మడతలు విప్పి అంచు యెలాగ వుందో, అదే అంచు మరో చీరకి యెలాగ నప్పుతుందో, ముచ్చటించుకోసాగారు. అందరితోపాటు సత్యవతి కూడా వుత్సాహంగా ఆ సంభాషణలో పాల్గొంది. పెద్ద పసుపురంగు బార్డరు వున్న యెరుపు చీర విప్పి తన భుజం మీద వేసుకు చూస్తున్న సత్యవతిని చూసి అన్నపూర్ణ,

"ఆ చీర నీకు చాలా నప్పింది సత్యవతీ! తెల్లని నీ వంటికి ఆ రంగు యెంత బాగుందో తెలుసా? తీసుకోరాదూ?" అంది శర్మగారి భార్య కూడా

"అవును. సత్యవతీ! అలాంటి పెద్దంచుల చీరలు నీలా పొడుగ్గా వున్న వాళ్ళకే బాగుంటాయి." అంటూ చీరల వాడివైపు తిరిగి,

"ఎంతకిస్తావోయ్?" అనడిగింది. వాడు నలభై అయిదు రూపాయలనగానే సత్యవతి గుటకలు మింగుతూ, "నలభై అయిదు రూపాయలే?" అంది. బట్టల మూటల వాడు తన నిజాయితీని ఆమె శంకిస్తోందనుకుంటూ,

"అమ్మగారూ! ఆ చీర నలభై అయిదుకి తక్కువ యెవరన్నా కొని తెస్తే ఈ బట్టల మూట యిక్కడే వదిలేసిపోతాను." అంటూ వుపన్యాసం లంకించుకున్నాడు. సత్యవతి నోరు తెరచే లోపలే శర్మగారి భార్య, అన్నపూర్ణ, బామ్మగారు వాడితో అరగంటసేపు హోరా హోరీ వాదించి బేరం నలభై రూపాయలకి సెటిల్ చేశారు. చీరల వాడు పెద్ద దానం చేస్తున్నట్టు గొణుక్కుంటూ చీర మడతపెట్టి సత్యవతి చేతిలో పెట్టాడు. పాపం! సత్యవతికి అసలు చీర కొనే వుద్దేశమే లేదు. చిన్న చిన్న వస్తువులకైతే కూరానారల డబ్బుల్లో మిగుల్చుకోవచ్చును గాని, నలభై రూపాయలు ఒక్కసారి యెక్కడ్నించి తెచ్చిస్తుందీ? అదీ గాకుండా యీమధ్య అదపా తడపా తనకంట పడుతున్న గోళ్ళరంగుల సీసాలూ, కాటుక పెన్సిళ్ళు, స్నోలు, పౌడర్ డబ్బాలతో సుందర్రావుకి పిసరంత అనుమానం కలిగి, సత్యవతికి చేతికి డబ్బులు అందకుండా బిగించేశాడు. ఇంటికి కావల్సిన వస్తువులు నాలుగూ తనే కొని పడేస్తున్నాడు. ఈ పరిణామంలో సత్యవతి అసలే గిజ గిజలాడుతోంది. పులిమీద పుట్రలాగ-హఠాత్తుగా యీ చీరల బేరం వచ్చి మెడకి చుట్టుకోవడంతో సత్యవతికి దిక్కుతోచలేదు. ఇంతసేపూ యిన్ని కబుర్లూ చెప్పి, యిన్ని బేరాలూ అయాక ఆ చీర వద్దు అని యెలా చెప్పాలో సత్యవతికి అర్థం కాలేదు. ఆఖరికి శర్మగారి భార్యని లోపలికి పిలిచి.

"నాదగ్గర డబ్బు వుందనుకున్నాను అక్కయ్యా! ఆయన చెప్పకుండా జేబులో వేసుకుపోయినట్టున్నారు, వచ్చే నెల నాన్న డబ్బు పంపిస్తారు. ఈ చీరవాడికి యిచ్చెయ్యి!" అంది బింకం సడలకుండా. శర్మగారి భార్యకి పచ్చివెలక్కాయ గొంతుకులో పడ్డట్టయింది. ఆవిడ సత్యవతి దగ్గర డబ్బు వుండకుండా వుంటుందా అనుకుంది. వాడితో అంతసేపూ బేరాలాడి, ఆ చీర వద్దు అంటే వాడు తిట్లకి లంకించుకుంటాడేమోనని ఆవిడ భయపడింది. అందుకని కాస్సేపు ఆలోచించి.

"నీదగ్గరెంతుందీ? ఓ అయిదుందా? నేనో అయిదిస్తాను. ఈ పదీ వాడికిచ్చి మిగతాది వచ్చే నెల వచ్చి తీసుకెళ్ళమందాం!" అంటూ సమస్య పరిష్కారం చేసేసింది. మొత్తంమీద అందరూ కలిసి మరుసటి నెల వచ్చి మిగతాడబ్బు తీసుకెళ్ళేటట్టు వాడిని వప్పించి పంపించేశారు. అప్పటికి ఆ సమస్య తీరింది గాని ముందెలాగో సత్యవతికి తోచలేదు. చీరలవాడికివ్వవలసిన బాకీ కాక శర్మ

[లోకజ్ఞానం – సమాధానాలు]

1. జయపూర్, లక్నో, కలకత్తా.
2. ఉంది. హవాయ్ ద్వీపంలో వున్న మౌనాకీ లేక మౌంటెన్ వైట్ నిజానికి ఎవరెస్ట్ పర్వతం కన్న ఎత్తైనది. ఇప్పుడు సముద్రంలోకి కూరుకుపోయివున్న ఈ పర్వతం ఎత్తు (నీటి అడుగునుండి) 33, 796 అడుగులు-అయితే సముద్ర మట్టంనుంచి చూస్తే ఈ పర్వతం ఎత్తు 13, 796 అడుగులు మాత్రమే అందువల్ల ఈ పర్వతం కన్న ఎవరెస్ట్ పర్వతమే (ఎత్తు 29,028 అడుగులు) ఎత్తయిన పర్వతంగా పరిగణింపబడుతున్నది.
3. పీటర్ గోల్డ్ మార్క్ (అమెరికా). 1948 లో తొలి లాంగ్ ప్లే రికార్డు విడుదల చేయబడింది.
4. షా మోనిక్స్ (ఫ్రాన్స్). 16 దేశాల తరపున 293 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారు.
5. చైనా దేశ చరిత్ర, భాష, సాహిత్యమూ ఆచార వ్యవహారాలు గురించి అధ్యయనం చేయడాన్ని 'సినాలజీ' అని అంటారు.
6. హిందూ పంచాంగం ప్రకారం వున్న 27 నక్షత్రాలలో నాల్గవ నక్షత్రం-రోహిణి.
7. సోవియట్ రష్యా — అక్టోబర్ 4, 1957
   అమెరికా — జనవరి 31, 1958
   ఫ్రాన్స్ — నవంబర్ 26, 1965
   జపాన్ — ఫిబ్రవరి 11, 1970
   చైనా — ఏప్రిల్ 24, 1970
8. జైసల్మార్ (రాజస్థాన్). ఈ నియోజక వర్గం విస్తీర్ణం 38,401 చదరపు కిలోమీటర్లు, అంటే దాదాపు కేరళ రాష్ట్రమంత అన్నమాట. భారతీయ జనతాపార్టీకి చెందిన చంద్రవీర్ సింగ్ గత ఎన్నికలలో ఈ నియోజక వర్గం నుండి ఎన్నికయ్యారు.
9. సునీల్ గవాస్కర్.
10. ఎమ్. హిదయతుల్లా.

భార్యకో అయిదు రూపాయలు యివ్వాలి. తనెక్కడ్నించి అంత డబ్బు ఈ లోపల సర్దుతుందీ? భర్తకి చెప్తే? అమ్మో! ఇంకేమైనా వుందా? ముందసలు ఆ చీర అతని కంటపడకుండా దాచెయ్యాలి — అనుకుంటూ చీర పెట్టె అడుగున పడేసింది. రోజులు గడిచే కొద్దీ దిగులుతో సత్యవతికి తిండి సయించడం మానేసింది. నాలుగు రోజుల తర్వాత నడవలోని సభలోకి రాబోతున్న సత్యవతిని చూసి పక్కింటి బామ్మగారు,

"అన్నట్టు సత్యవతీ! నాలుగు రోజులక్రితం నీదగ్గర తీసుకున్న బియ్యం యివ్వటం మరిచిపోయానుసుమా! మళ్ళీ సాయంత్రం పనివేళ! ఒక్క నిముషం రాతల్లీ కొలిచి యిచ్చేస్తాను." అంటూ యింట్లోకి లాక్కెళ్ళింది. ఆవిడ తను యివ్వవలసిన రెండుకిలోల బియ్యం యివ్వబోతూ వుంటే సత్యవతికి మెరుపు లాంటి ఆలోచనతట్టి, ఆవిడ్ని వారిస్తూ—

"పిన్నిగారూ! ఇంట్లో వున్న బియ్యం పురుగులు పట్టి పుచ్చిపోతున్నాయిగానీ, వీటికి ధర కట్టి డబ్బు యిచ్చెయ్యండీ! మొన్నామధ్య నాన్నగారో పాతిక శేర్ల బియ్యం పంపించేరు. ఇద్దరు మనుషులం! అన్ని బియ్యం యేం చేసుకుంటాం చెప్పండీ?" అంది. సత్యవతి మాటలకి ఆవిడ తెల్లబోయింది. ఆమె మాటలు నమ్మినా నమ్మకపోయినా డబ్బు లివ్వటం తనకు లాభం గనక మూడు రూపాయలు తెచ్చి చేతిలో పెట్టింది. అయిదు రూపాయలు ఖరీదుచేసే బియ్యం ఆవిడ చేతిలో పోశానే అని సత్యవతి బాధపడలేదు. బియ్యం అయిపోయాయంటే భర్త మళ్ళీ తెచ్చి పడేస్తాడు. కాబట్టి బెంగలేదు. ఈ కొత్త పద్ధతిలో సత్యవతి చాలా సులభంగా శర్మగారి భార్య అప్పు తీర్చేసి, చీరలవాడి డబ్బు కూడా జాగ్రత్త పెట్టింది. మళ్ళీ సినిమాలకీ, షికార్లకీ తడుముకోనక్కరలేకపోయింది. "ఊర్నుంచి చింతపండు వచ్చింది కావాలా వదినా?" అంటూ చింతపండూ, "వద్దు మొర్రో అంటుంటే మిరపకాయలు, కందిపప్పు పంపించారు నాన్నగారు. ఏం చేసుకోవాలో తోచటం లేదు." అంటూ ప్రతీ వస్తువూ బేరం పెట్టేది. హఠాత్తుగా యింటి ఖర్చు యింతలాగ ఎలా పెరిగిపోతోందో అర్థంకాక సుందర్రావు కొన్నాళ్ళు గిలగిల్లాడాడు. అస్తమానం బియ్యం నిండుకున్నాయనీ, పప్పు అయిపోయిందనీ సణుగుతూ వుంటే భార్య మీద అతనికి మొదట్లో యేలాంటి అనుమానం కలగలేదు. కాని ఒకరోజు వంట్లో బాగులేక శలవుపెట్టి యింటికి వచ్చిన అతనికి, యిరుగు పొరుగు ఆడవాళ్ళ కొంగుల్ని యేవో మూటలు కట్టుకుని పోతూ వుండటం కంటపడింది. అంతే గాకుండా ఒకటి రెండుసార్లు 'మా అమ్మ యీ డబ్బు పిన్నికి యివ్వమంది' అంటూ పక్కింటి పిల్లలు రెండు మూడు రూపాయలు అతని చేతుల్లో పెట్టడం జరిగి అతను సత్యవతిని నిలదీసి అడిగాడు. సత్యవతి అతని ప్రశ్నలకు తడబడి అందీ పొందకుండా జవాబులు చెప్పడంతో అతని అనుమానం మరింత యెక్కువై, భార్యకి తెలియకుండా ఆమెని జాగ్రత్తగా గమనించసాగేడు. ఒకసారి 'రాజేశ్వరి గుసగుసల్తో మర్నాటి సినిమా ప్రోగ్రాం చర్చించడం, అన్నపూర్ణ "నువ్విచ్చిన బియ్యం బాపతు డబ్బు" అంటూ సత్యవతికి చేతిలో డబ్బు పెట్టడం, సత్యవతి పెట్లో అతనికంట పడిన కొత్తచీర రవికెల గుడ్డలు, పాతిక, ముప్ఫైదాకా డబ్బూ అతనికి మొత్తం కథ అర్థమయ్యేటట్టు చేశాయి. తన చాటున తన కష్టార్జితంతో భార్య సాగిస్తున్న వ్యాపారం గురించి తెలుసుకోగానే అతని తల గిర్రున తిరిగిపోయింది. భార్యమీద అంతులేని కోపం వచ్చింది. బావగొట్టి చెవులు ముయ్యాలనుకున్నాడు. అందువల్ల సత్యవతి మరింత మొండికెత్తడం తప్ప లాభం వుండదనిపించింది. మరి ఆమెకి బుద్ధి యెలా చెప్పడం? ఏంచేస్తే ఆమె మారుతుంది? అసలు ఆమె మారుతుందా? వెచ్చాలన్నీ పెట్లో పెట్టి తాళం వేసి, యేరోజు సరుకు ఆరోజు తీసి యిస్తే? మరో మార్గం వెతుకుతుందేమో! ఆమె తన ప్రవర్తన సరిదిద్దుకోకపోతే యెన్నాళ్ళిలాగ! పోనీ నెలకింత అని పాకెట్ మనీ యిస్తే? యాభై వేలూ అరవై వేలూ ఖర్చు చెయ్యడానికి అలవాటుపడిన ఆమెకి తను యిచ్చే అయిదూ, పదీ, యేమూలకి? ఇల్లు మార్చేస్తే? మరోయిల్లు యీ అద్దెలో యెలా దొరుకుతుందీ? అతనికి యేమార్గమూ నచ్చలేదు. సత్యవతిలో భయం పుట్టించడం కంటే పరివర్తన కలిగేటట్టు చెయ్యాలి. అదెలా సాధ్యం? ఆమె యెదురు చూడని శిక్ష వేస్తే షాక్ ట్రీట్‌మెంట్ లాగ పనిచేస్తుందేమో! ఆ ఆలోచనతో అతనికి కొత్త వుత్సాహం వచ్చింది.

*

భర్త మనసులోని ఆలోచనల అలజడి సత్యవతికి యెంతమాత్రం తెలియలేదు. అందుకే ఆనాడు భర్త జేబులోంచి రైలు టిక్కెట్టు తీసి తన చేతిలో పెట్టగానే తెల్లబోయి "ఏమిటిది?" అనడిగింది. సుందర్రావు బట్టలు మార్చుకుంటూ.

"మీ వూరికి టిక్కెట్టు! ఇవాళనించీ మన యిద్దరికీ యేలాంటి సంబంధం వుండదు" అన్నాడు. సత్యవతి వెర్రిదాన్లా అతనివైపు చూసింది. ఆమె మనసుకి భర్త యెందుకు అలాంటి నిర్ణయం తీసుకున్నాడో సులభంగానే తెలిసిపోయింది. ఏనాటికైనా తన నేరం బయట పడవచ్చుననే భయం ఆమెలో వుంది. కాని దానికి శిక్ష యింత కఠినంగా వుంటుందని ఆమె అనుకోలేదు. భార్య మాట్లాడకపోవటం చూసి సుందర్రావు అన్నాడు—

"ఇంకా అర్థం కాలేదూ? నీ ప్రవర్తన నాకు నచ్చడం లేదు. నేనెన్ని అష్టకష్టాలు పడి యీ సంసారాన్ని యీదుకు వస్తున్నానో నీకు తెలుసు. అలాంటిది, నా కష్టార్జితంతో నువ్వు చేస్తున్న వ్యాపారం నాకు తెలియదనుకోకు! మీ నాన్నకి నీ సంగతంతా వుత్తరం రాశాను. నువ్వు వచ్చిన చోటుకే వెళ్ళవచ్చు" అతని మాటలు పూర్తికాకుండానే సత్యవతి రివ్వున అతని కాళ్ళని చుట్టుకుని,

"నన్ను క్షమించరూ? ఇంకెప్పుడూ యిలా చెయ్యను." అంటూ బ్రతిమాల సాగింది. ఆమె కన్నీళ్ళు, వాగ్దానాలు అతని నిర్ణయాన్ని మార్చలేకపోయాయి. మర్నాడు సత్యవతి రైలు యెక్కక తప్పలేదు.

*

భార్యని గురించే ఆలోచిస్తూ సుందర్రావు స్టేషన్ నించి బయటపడి, పక్కనున్న పోస్టాఫీసులో కవరు ఒకటి కొని మామగారికి జరిగిన సంగతంతా వుత్తరం రాస్తూ,

"....మీ అమ్మాయితో నేను తనని వదిలేసినట్టు చెప్పాను. కొన్నాళ్ళపాటు ఆ సంగతి నిజమేనని ఆమెని అనుకోనివ్వండి. మనిషికి పశ్చాత్తాపాన్ని మించిన శిక్ష వుంటుందనుకోను. ఇక్కడ వుంటే ఆమె పశ్చాత్తాపడ్డా అది క్షణికమే అవుతుంది. అందుకే చిన్న షాక్ యిచ్చి అక్కడికి పంపాను. ఎప్పటికప్పుడు ఆమెని గురించిన వివరాలతో మీ దగ్గర్నించి వుత్తరాలు యెదురు చూస్తూ వుండే మీ అల్లుడు...." అని ముగించి, పోస్టు చేసి యింటివైపు నడిచాడు సుందర్రావు! □